అమరావతి, నవంబర్ 11 (ఈవార్తలు): అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన కేసులో నిందితుడు హేమంత్ అలియాస్ దుమ్ము తొలగించిన కుడి కాలును భద్రపరచాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. పోలీసుల కాల్పుల ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం పిటిషన్‌పై విచారణ చేపట్టింది. నిందితుడి కాలును భద్రపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. మల్లేశ్వరిని, పోలీసులను ఆదేశించింది. ప్రభుత్వాన్ని కౌంటర్ అఫిడవిట్ల దాఖలు చేయాలని సూచిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది. అక్టోబర్ 31న రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హేమంత్ (21) పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రాణాలతో బయటపడి ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఘటన మరుసటి రోజు ఆత్మకూరు అటవీ ప్రాంతంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నేర ఘటనా స్థల పునర్నిర్మాణం కోసం తీసుకెళ్లిన సమయంలో నిందితుడు తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు కాల్పులు జరిపినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ ఘటనలో అతడి కాలు తీవ్రంగా గాయపడింది. రక్తనాళాలు దెబ్బతినడంతో గ్యాంగ్రీన్ ఏర్పడగా, నవంబర్ 3న వైద్యులు కుడి కాలును తొలగించారు. పోలీసుల కాల్పులపై సీబీఐ విచారణ కోరుతూ మంగళగిరికి చెందిన న్యాయవాది గుండ గోపీకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో విద్యాశాఖ అధికారులను ప్రతివాదులుగా చేర్చాలన్న అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది.



అమిత్ షా విశాఖ పర్యటన రద్దు



విశాఖపట్నం, నవంబర్ 11 (ఈవార్తలు): విశాఖపట్నంలో గురువారం ప్రారంభం కానున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకావడం లేదు. అనివార్య కారణాలతో ఆయన పర్యటన రద్దయినట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా తెలియజేసింది. అమిత్ షా స్థానంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. భారత పరిశ్రమల సమాఖ్య, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. 'కొత్త ప్రపంచ వ్యవస్థలో మార్గనిర్దేశం: వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం' అనే ఇతివృత్తంతో సదస్సు జరగనుంది. సుమారు 58 దేశాల నుంచి దౌత్యవేత్తలు, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సదస్సుకు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. నవంబర్ 13న జరిగే ముగింపు సమావేశానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా

అమరావతి, నవంబర్ 11 (ఈవార్తలు): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ నగరాలు సత్తా చాటాయి. దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరాల జాబితాలో విజయవాడ మూడో స్థానంలో నిలవగా, పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మొదటి స్థానాన్ని దక్కించుకుంది. మూడు నుంచి పది లక్షల జనాభా విభాగంలో గుంటూరు మూడో ర్యాంకు సాధించింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు అందజేశారు. జనాభా ఆధారిత విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మొదటి స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానాన్ని, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. మూడు నుంచి పది లక్షల జనాభా విభాగంలో ఉజ్జయిని మొదటి స్థానంలో, చండీగఢ్ రెండో స్థానంలో నిలిచాయి. మొత్తం ర్యాంకింగ్స్‌లో మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై మొదటి స్థానాన్ని, గుజరాత్‌లోని సూరత్ రెండో స్థానాన్ని, విజయవాడ మూడో స్థానాన్ని సాధించాయి. గత ఎనిమిదేళ్లుగా స్వచ్ఛ నగరాల జాబితాలో అగ్రస్థానంలో నిలుస్తూ వచ్చిన ఇండోర్ ఈసారి మొదటి మూడు స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోయింది. స్వచ్ఛ సర్వేక్షణ్ పదో విడతలో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 4,751 నగరాల్లో సర్వే నిర్వహించారు. ఇతర విభాగాల్లో రివర్‌ఫ్రంట్ నగరాల కేటగిరీలో రేవా మొదటి స్థానంలో, బిలాస్‌పూర్ రెండో స్థానంలో, వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. తీరప్రాంత పట్టణాల విభాగంలో పూరీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల విజయంతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

ప్రశ్నించే తత్వమే నిజమైన విద్యకు పునాది

సామాజిక చైతన్యంతోనే సమాజ అభివృద్ధి.. ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు

వేములవాడ అర్బన్, నవంబర్ 11 (ఈవార్తలు): విద్య అనేది వ్యక్తిగత వికాసానికే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ సమాజ అభివృద్ధి, మార్పులో కీలక పాత్ర పోషించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు అన్నారు. విద్య ప్రజాస్వామికీకరణ ద్వారానే సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని పేర్కొన్నారు. వేములవాడలో కామ్రేడ్ రంగవల్లి విజ్ఞాన కేంద్రం రెండో వార్షికోత్సవం, రంగవల్లక్క 27 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రం అధ్యక్షురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్య అంటే పుస్తకాల్లోని పాఠాలు చదవడం, పట్టాలు పొందడం మాత్రమే కాదని, సమాజంలోని అసమానతలను ప్రశ్నించే చైతన్యాన్ని, ప్రజల పట్ల బాధ్యతను కలిగించేదిగా ఉండాలని అన్నారు. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి తత్వవేత్తలు విద్యను ప్రశ్నించే తత్వానికి, సామాజిక మార్పునకు అనుసంధానించారని గుర్తుచేశారు. కార్ల్ మార్క్స్ కూడా తన రచనల్లో విద్య, సమాజ మార్పునకు ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థను తమ ప్రయోజనాలకు అనుగుణంగా కొనసాగించేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థలు ప్రయత్నిస్తాయని విమర్శించారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి విద్యపై సామాజిక ఆంక్షలు కొనసాగాయని, వేదాలు, ఉపనిషత్తులు చదివే హక్కును కొందరికే పరిమితం చేసి సమాజాన్ని కులాలు, వృత్తులుగా విభజించారని అన్నారు. అణగారిన వర్గాలకు విద్యావకాశాలు దూరం చేయడం సామాజిక అసమానతలకు కారణమైందని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యావిధానంలోనూ సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచనలను పెంపొందించే దిశగా లేదని విమర్శించారు. విద్యను ప్రజాస్వామికీకరించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా యువత చేపడుతున్న జెన్-జీ ఉద్యమాలు ప్రగతిశీల శక్తులకు కొత్త ఆశను కల్పించాయని, యువత విద్య, వైద్యం వంటి మౌలిక హక్కులతో పాటు రాజ్యాంగాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరుతోందని తెలిపారు.

అమరుల ఆశయాల సాధనకు ఐక్య ఉద్యమాలు: విమలక్క

రంగవల్లక్కతో తనకు సుదీర్ఘ ఉద్యమ అనుబంధం



ఉందని విమలక్క అన్నారు. ఆమెను స్మరించుకోవడం అంటే జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాదని, ఆమె సాగించిన పోరాటాలను కొనసాగిస్తూ సమాజంలోని సమస్యలపై సమష్టిగా పోరాడాల్సిన బాధ్యతను స్వీకరించడమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పేరుతో కోట్లాది మంది ఓట్లు గల్లంతయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై ముద్రలు వేసి అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కని, ప్రజా సమస్యలపై గొంతెత్తే వారిని అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అమరుల ఆశయాల సాధనకు ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక శక్తులు, ప్రగతిశీల ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సభలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు పాల్గొని రంగవల్లక్క ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆర్వీకే సభ్యురాలు రాజేశ్వరి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, పీడీఎస్యూ (విజృంభణ) నాయకుడు విజయ్, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక రాష్ట్ర కన్వీనర్ వి. సంతోష్, శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మి, దళిత బిరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్పాడి సుదర్శన్, స్వామిదాస్, శ్రీనివాస్, వాణి వొల్లాల, గొట్టె రుక్మిణి, మల్లారెడ్డి, అరుణోదయ రాకేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, బొల్లం లింగమూర్తి, బిజిగిరి నవీన్ కుమార్, జేఏసీ నాయకులు జి.ఎస్. ఆనంద్, గొడిశాల రమేష్ గౌడ్, పోతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ సేవలు మరువలేనివి



జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ బారీ అన్నారు. మౌలానా ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని తీన్ ఖని చౌరస్తా వద్ద కమిటీ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బారీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా ఆజాద్ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. దేశంలోని పలువురు మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ మౌలానా ఆజాద్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించకపోవడం సరికాదని నాయకులు అన్నారు. ఇకపై ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని, జగిత్యాల పట్టణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఇమ్రాన్, ఆదిల్ పటేల్, ముకస్సర్ అలీ నేహాల్, షకీల్, షజ్జీ ఫెరోజ్, ఫర్హాన్, రియాజ్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి: ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు) : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. బుధవారం చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బియ్యం అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ధరలను కృత్రిమంగా పెంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు విద్యుత్, సాగునీరు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. చల్‌గల్ మార్కెట్‌లో రూ.8 కోట్లతో షెడ్లు, రూ.1.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసూనాంబ, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు సర్పంచులు

ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం: అడ్లూరి

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు) : గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట, ఆత్మకూరు గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో దమ్మన్నపేట సర్పంచ్ ముదాం గౌతమి జానారెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్‌లో చేరిన సర్పంచులను అభినందించారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, మార్పు కోరుకున్న ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం కల్పించారని అన్నారు. అర్హులకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. రెండు గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రంగధాంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎద్దు శంకరయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, నిశాంత్ రెడ్డి, కటారి చంద్రశేఖర్‌రావు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



యువజనోత్సవాలతో ప్రతిభకు వేదిక

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు) : యువతలోని సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను వెలికితీయడమే యువజనోత్సవాల ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీల్లో పాల్గొని మాట్లాడారు. వివిధ కళా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మొత్తం 167 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. జానపద నృత్యం, జానపద గేయాలు, చిత్రలేఖనం, కవితా రచన పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త తిరుపతిరెడ్డి, పరశురామ్ గౌడ్, రాజేశ్, విక్రమ్ రెడ్డి, కొండ రవి తదితరులు పాల్గొన్నారు. పోటీలకు సతీశ్, పరశురామ్ గౌడ్, శ్యాంసుందర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



ఉస్మానియాలో జాతీయ విద్యా దినోత్సవ క్విజ్

19 విభాగాల విద్యార్థుల భాగస్వామ్యం.. లైబ్రరీ సైన్స్‌కు ప్రథమ బహుమతి

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడం, మేధో సామర్థ్యాన్ని వెలికితీయడం, సమకాలీన అంశాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ పోటీల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 19 విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో లైబ్రరీ సైన్స్ విభాగం ప్రథమ, భూగోళశాస్త్ర విభాగం ద్వితీయ బహుమతులు సాధించాయి. తత్వశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వంశీధర్, రాజకీయ శాస్త్ర ప్రొఫెసర్ రవి బానోత్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రజా పరిపాలన విభాగాధిపతి ప్రొఫెసర్ అరుణ జ్యోతి స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విద్యా, విజ్ఞాన రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లోనూ కళాశాల విద్యార్థులు ముందువరుసలో నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాధారణ విజ్ఞానం, సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇటువంటి పోటీలు ఆత్మవిశ్వాసం, విశ్లేషణాత్మక ఆలోచన, సమయస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో క్విజ్ క్లబ్ సభ్యులు బెల్లం ఉదయ్, పిల్లి మహేష్, రామకృష్ణ, వెంకట్, రఘుసాయి, వంశీకృష్ణ, వినయ్, సుమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు నందయ్యకు జ్యోతి సన్మానం

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్యను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, మహిళా కాంగ్రెస్ అభివృద్ధిపై ఇరువురూ చర్చించారు. కార్యకర్తల సమన్వయంతో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తామని జ్యోతి లక్ష్మణ్ తెలిపారు.





కాచిగూడలో డి-వాఫిల్ కేఫ్ ఏడో శాఖ

కాచిగూడ, నవంబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్‌లో విస్తరిస్తున్న వాఫిల్ బ్రాండ్ డి-వాఫిల్ కేఫ్ తన ఏడో శాఖను కాచిగూడలో బుధవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రిబ్బన్ కట్ చేసి నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు వినూత్న ఆలోచనలతో వ్యాపార రంగంలోకి రావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన సేవలతో వినియోగదారుల ఆదరణ పొందుతూ తక్కువ సమయంలోనే ఏడో శాఖను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి భరత్ గుప్తా, కాచిగూడ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మాట్లాడుతూ వినియోగదారుల ఆదరణతో గూగుల్‌లో 4.9 రేటింగ్ సాధించి నగరంలో ప్రముఖ వాఫిల్ కేఫ్ బ్రాండ్‌గా ఎదిగామని తెలిపారు. ఏడో శాఖ ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా కాచిగూడ శాఖలో రూ.300కు పైబడిన ప్రతి బిల్లుపై ప్రత్యేక చక్రం తిప్పే పోటీ ద్వారా బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశం ప్రారంభ తేదీ నుంచి పది రోజుల పాటు ఉంటుందని వెల్లడించారు. రెండో శ్రేణి నగరాల్లో విస్తరణలో భాగంగా తదుపరి పది శాఖలకు రూ.లక్ష ఫ్రాంచైజీ రుసుముతో అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, వినియోగదారులు పాల్గొన్నారు.



అన్నదాన ట్రస్టుకు రూ.1,00,001 విరాళం

వేములవాడ అర్బన్ , నవంబర్ 11 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు వరంగల్‌కు చెందిన వేముల సువర్ణ--నాగరాజు దంపతులు రూ.1,00,001 విరాళంగా అందించారు. బుధవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పీఆర్వో పెరిక శ్రీనివాస్‌కు నగదు రూపంలో విరాళాన్ని అందజేశారు. అనంతరం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నంబర్ ప్లేట్లు లేకుంటే చర్యలు

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు) : నంబర్ ప్లేట్లు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలపై జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనలతో పట్టణ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 150 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. వాహనదారులకు అవగాహన కల్పించి, ముందు, వెనుక వైపులా ప్రామాణిక నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించారు. ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.



గడి బురుజు స్థలం కోసం పోరాటం

కోరుట్ల, నవంబర్ 11 (ఈవార్తలు) : పట్టణ చారిత్రక గుర్తింపుగా నిలిచిన గడి బురుజు స్థలాన్ని కాపాడే వరకు తన పోరాటం కొనసాగిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. గడి బురుజు స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే అంశంపై ఆయన స్పందిస్తూ ప్రజా ఆస్తుల పరిరక్షణ తన బాధ్యతని పేర్కొన్నారు. స్థలానికి సంబంధించిన వీఎల్‌టీని రద్దు చేసే వరకు పోరాటం ఆపబోనని తెలిపారు. ఈ వ్యవహారంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రమేయం ఉన్నా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు. గడి బురుజు స్థలాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా ఆస్తుల విషయంలో అక్రమాలకు తావులేకుండా చూడాలని, ఈ పోరాటం ఆరంభం మాత్రమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జగిత్యాల కేవీలో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

జగిత్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల చెల్గల్‌లోని కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక ఉపాధ్యాయులు, సంగీతం, నృత్య కోచ్ పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది ఎంపిక కోసం ఈ నెల 20న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విద్యాలయ చైర్మన్ బి. సత్యప్రసాద్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కేవీఎస్ సంవిధా సాథి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం నవంబర్ 20న చెల్గల్‌లోని కేంద్రీయ విద్యాలయంలో జరిగే ప్రత్యక్ష ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం విద్యాలయాన్ని లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కోదండ రామాలయ నిర్మాణానికి భారీ విరాళం

మల్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): మల్యాల గ్రామ శివారులో నిర్మించతలపెట్టిన శ్రీ కోదండ రామాలయానికి రూ.5,55,555 విరాళం అందించారు. శ్రావణి (చిట్టి), ఉత్తేజ్‌రెడ్డి మారం దంపతుల తరఫున వారి తల్లిదండ్రులు రనిత రెడ్డి, దేవేందర్ రెడ్డి (ఉత్తేజ్ రియాల్టీ, హైదరాబాద్) ఈ విరాళాన్ని సమర్పించారు. ఆలయ నిర్మాణం వంటి ధార్మిక కార్యక్రమానికి ఉదారంగా విరాళం అందించడంపై నిర్మాణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. విరాళం అందించిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆశీస్సులతో ఆ కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించింది.



మహా పాదయాత్రకు బీజేపీ సన్నాహాలు

18న బండి ఆధ్వర్యంలో కార్యక్రమం.. నితిన్ నవీన్ హాజరు

మల్యాల, నవంబర్ 11 (ఈవార్తలు): ఈ నెల 18న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నితిన్ నవీన్ హాజరుకానున్న నేపథ్యంలో మల్యాల మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం అధ్యక్షతన బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. జన సమీకరణ, రవాణా ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, సర్పంచులు లత, సంకుర్తి తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతం, మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటాన్స్ తదితరులు పాల్గొన్నారు.



బీజేఆర్ కళాశాలకు జిజ్ఞాస అవార్డు

హైదరాబాద్, నవంబర్ 11 (ఈవార్తలు): నారాయణగూడలోని బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ స్వయంప్రతిపత్తి కళాశాల వృక్షశాస్త్ర విభాగం రాష్ట్రస్థాయి జిజ్ఞాస ప్రాజెక్టుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఈ.ఎం. సునీత నేతృత్వంలోని పరిశోధనా బృందం రూపొందించిన వినూత్న పరిశోధనకు ఈ పురస్కారం లభించింది. ‘మొక్కల ఆధారిత జీవక్షయ హైడ్రోజెల్స్ – పట్టణ వ్యవసాయం, నీటి సంరక్షణలో వినూత్న మార్పులు’ అనే అంశంపై బృందం పరిశోధన ప్రతిపాదించింది. నేలలో తేమను ఎక్కువకాలం నిలిపి ఉంచడం, నీటి వృథాను తగ్గించడం, పర్యావరణహిత పట్టణ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశం. తెలంగాణ ఉన్నత విద్యా కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ ఎం. విజయ్ కుమార్ అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతోనే ఈ విజయం సాధ్యమైందని పరిశోధనా బృందం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ విజేతలను అభినందించారు. ఈ విజయం కళాశాల పరిశోధనా సామర్థ్యానికి, పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధతకు నిదర్శనమని అధ్యాపకులు పేర్కొన్నారు.

కుప్పకూలిన మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలింపు.. వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు



న్యూఢిల్లీ, నవంబర్ 11: భారత మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ (75) అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం నడకకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి కొద్దిసేపు స్పృహ కోల్పోయారు. దీంతో ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్ కార్డియో-న్యూరో కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజువారీ నడకలో భాగంగా ఉదయం బయటకు వెళ్లిన ధన్‌ఖడ్ అకస్మాత్తుగా కిందపడిపోయారు. కొన్ని నిమిషాలపాటు స్పందించలేదు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను తొలుత పోలీసు వాహనంలో నివాసానికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న వైద్య బృందంతోపాటు ఎయిమ్స్ కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ సందీప్ సేథ్ ఆయన నివాసానికి చేరుకుని ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఎయిమ్స్ కార్డియో-న్యూరో కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఎయిమ్స్ కార్డియాలజీ విభాగానికి చెందిన నిపుణులు ఆయనకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రి వర్గాల నుంచి అధికారిక ఆరోగ్య నివేదిక వెలువడాల్సి ఉంది.

విద్యుత్ లేకుండానే కూరగాయల నిల్వ



జెరూసలేం, నవంబర్ 11: పంట కోత అనంతరం కూరగాయలు, పండ్లు పాడైపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో శీతల నిల్వ సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్, డీజిల్ వంటి ఇంధనాలు అవసరం లేకుండా పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే సరికొత్త సాంకేతికతను ఇజ్రాయెల్ నిపుణులు అభివృద్ధి చేసినట్లు కథనం వెల్లడించింది. ఈ విధానం బాష్పీభవన శీతలీకరణ సూత్రంపై పనిచేస్తుంది. నీరు ఆవిరిగా మారే ప్రక్రియ ద్వారా నిల్వ గది లోపలి ఉష్ణోగ్రతను తగ్గిస్తారు. ప్రత్యేక కంటైనర్‌లో తేమను నియంత్రించడం ద్వారా కూరగాయలు, పండ్లు ఎండిపోకుండా, బరువు తగ్గకుండా కాపాడవచ్చని సమాచారం. ఈ వ్యవస్థకు విద్యుత్ గ్రిడ్, బ్యాటరీలు లేదా జనరేటర్ల అవసరం ఉండదని కథనం పేర్కొంది. సంప్రదాయ శీతల గిడ్డంగులతో పోలిస్తే ఈ వ్యవస్థ నిర్మాణం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉంటాయని అంచనా. దీని ద్వారా పండ్లు, కూరగాయలను 7 నుంచి 15 రోజులపాటు తాజాగా ఉంచవచ్చని చెబుతున్నారు. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే రైతులకు పంటను కోసిన వెంటనే విక్రయించాల్సిన ఒత్తిడి తగ్గుతుంది. మార్కెట్‌లో ధరలు అనుకూలంగా ఉన్నప్పుడు విక్రయించుకునే అవకాశం లభిస్తుంది. రవాణాలో ఆలస్యమైనా ఉత్పత్తుల నాణ్యతను కాపాడుకోవచ్చు. విద్యుత్ సదుపాయం తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు ఈ విధానం ఉపయోగపడనుంది.

కాంగ్రెస్, బీజేపీతో నాకు సంబంధం లేదు: అన్నా హజారే

అహిల్యానగర్, నవంబర్ 11: తన నేతృత్వంలో 2011లో జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంపై సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను సామాజిక కార్యకర్త అన్నా హజారే తప్పుబట్టారు. తనకు కాంగ్రెస్, బీజేపీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల గురించి కాకుండా దేశం, సమాజ పరిస్థితులపై దృష్టి పెట్టాలని సోనియాకు సూచించారు. సోనియా గాంధీ ఇటీవల రాసిన ‘బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకంలో అన్నా హజారే ఉద్యమాన్ని ప్రస్తావించారు. 2011లో ఆయన నేతృత్వంలో సాగిన ‘ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్’ ఉద్యమానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ తెరవెనుక మద్దతు ఇచ్చాయని కొందరు ప్రముఖులు తర్వాత వెల్లడించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఉద్యమం కారణంగా అప్పటి యూపీఏ ప్రభుత్వం, కాంగ్రెస్ ఇబ్బందుల్లో పడ్డాయని, ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రత్యర్థుల లక్ష్యమని పుస్తకంలో రాశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో అన్నా హజారే స్పందించారు. తన ఉద్యమం కారణంగా ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కూడా పదవులు కోల్పోయారని వ్యాఖ్యానించారు. తనకు రాజకీయ పార్టీల కంటే దేశం, సమాజ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. కరవు సమయంలో బాధితుల కోసం తన పింఛను సొమ్మును ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఫలాలిచ్చే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయని హజారే వ్యాఖ్యానించారు. తన జీవితాన్ని దేశం, సమాజం కోసమే అంకితం చేశానని, విమర్శలను పట్టించుకోకుండా తన బాధ్యతను కొనసాగిస్తానని చెప్పారు. త్వరలో విడుదల కానున్న ‘అన్నా హజారే: గ్రామయోగి’ పుస్తకంలో తన జీవిత విశేషాలు ఉంటాయని వెల్లడించారు.

రికార్డుల దిశగా

జీటీఏ-6 ముందస్తు బుకింగ్‌లు



న్యూఢిల్లీ, నవంబర్ 11: ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘గ్రాండ్ తెఫ్ట్ ఆటో-6’ (జీటీఏ-6) విడుదలకు ముందే రికార్డుల దిశగా దూసుకెళ్తోంది. నవంబర్ 19న విడుదల కానున్న ఈ ఆటకు భారీగా ముందస్తు ఆర్డర్లు నమోదవుతున్నాయి. డిజిటల్ మార్కెట్ విశ్లేషణ సంస్థ సెన్సార్ టవర్ అంచనాల ప్రకారం.. ఇప్పటివరకు సుమారు 96.9 లక్షల డిజిటల్ కాపీలకు ముందస్తు బుకింగ్‌లు నమోదయ్యాయి. వీటి ద్వారా దాదాపు 942 మిలియన్ డాలర్ల (రూ.7,800 కోట్లకు పైగా) ఆదాయం వచ్చినట్లు అంచనా. ముందస్తు బుకింగ్‌లలో సోనీ ప్లేస్టేషన్-5 వినియోగదారుల వాటా 74 నుంచి 75 శాతంగా ఉంది. మిగిలిన 25 నుంచి 26 శాతం బుకింగ్‌లు ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్, ఎస్ పరికరాల ద్వారా నమోదయ్యాయి. ఆటను కొనుగోలు చేసిన వారిలో సుమారు 89 శాతం మంది 100 డాలర్ల విలువైన అల్టిమేట్ ఎడిషన్‌ను ఎంచుకున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. సాధారణ ఎడిషన్ ధర 80 డాలర్లుగా ఉంది. ముందస్తు ఆర్డర్లు తమ అంచనాలను మించిపోయాయని ఆటను విడుదల చేస్తున్న టేక్-టూ ఇంటరాక్టివ్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి స్ట్రాస్ జెల్నిక్ తెలిపినట్లు కథనం పేర్కొంది. అయితే అధికారిక విక్రయాల వివరాలను విడుదల తర్వాత వెల్లడించనున్నట్లు సమాచారం. భౌతిక ప్రతుల బుకింగ్‌లను కూడా కలిపితే ఆదాయం ఇప్పటికే 100 కోట్ల డాలర్లను దాటి ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఆటను ఏర్పాటు చేసుకోవడానికి సుమారు 212 జీబీ నిల్వ స్థలం అవసరమవుతుందని సమాచారం. నవంబర్ 10 నుంచే ముందస్తు డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికాలోని ఫ్లోరిడాను పోలిన కల్పిత ‘లియోనిడా’ ప్రాంతం నేపథ్యంలో కథ సాగుతుంది. లూసియా కామినోస్, జాసన్ డువాల్ ప్రధాన పాత్రలుగా ఆటను రూపొందించారు. 2013లో విడుదలైన జీటీఏ-5 ప్రపంచవ్యాప్తంగా సుమారు 23 కోట్ల కాపీలు అమ్ముడైంది. ఈ నేపథ్యంలో జీటీఏ-6 విడుదలతో గేమింగ్ రంగంలో కొత్త రికార్డులు నమోదవుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లకు గాయాలు

కుల్గామ్, నవంబర్ 11: జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో సీఆర్పీఎఫ్ శిబిరంపై జరిగిన ఉగ్రదాడికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాదులు కేవలం 15 సెకన్ల వ్యవధిలో సుమారు 30 రౌండ్ల కాల్పులు జరిపినట్లు ఫుటేజ్‌లో నమోదైంది. ఈ దాడిలో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. గాయపడిన వారిని హెడ్ కానిస్టేబుల్ సోమ్‌వీర్ సింగ్, కానిస్టేబుళ్లు రాకేశ్ దాస్, సంతోష్ చంద్రగా గుర్తించినట్లు సీఆర్పీఎఫ్ తెలిపింది. మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో దాడి జరిగినట్లు సమాచారం. మొదట 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పుల శబ్దాలు వినిపించగా, ఆ తర్వాతి నిమిషంలో మరో 12 రౌండ్ల కాల్పులు నమోదయ్యాయి. ఫుటేజ్‌లో ఓ సీఆర్పీఎఫ్ జవాన్ దుకాణాల ముందు కూర్చుని ఉండగా, కాల్పులు జరిగిన వైపు నుంచి మరో జవాన్ పరుగెత్తుకుంటూ రావడం కనిపించింది. అనంతరం ఇద్దరూ తుపాకులతో కాల్పులు జరిగిన ప్రాంతం వైపు కదిలారు. దాడి సమయంలో వ్యక్తుల అరుపులు, హెచ్చరికల శబ్దాలు కూడా వినిపించాయి. దాడి అనంతరం ఘటనాస్థలికి అదనపు భద్రతా బలగాలను తరలించారు. పరిసర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, సాయుధ వాహనాలతో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్థానికులు ఇళ్లలోనే ఉండాలని అధికారులు లౌడ్‌స్పీకర్ల ద్వారా సూచించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అదే సమయంలో కుల్గామ్ జిల్లాలోనే ఉన్నప్పటికీ, దాడి జరిగిన ప్రాంతానికి సమీపంలో లేరని అధికారులు తెలిపారు.

స్టాక్ మార్కెట్లకు లాభాలు



ముంబై, నవంబర్ 11: అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, వాహన తయారీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 772.75 పాయింట్లు (0.95 శాతం) లాభపడి 81,879.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 210.40 పాయింట్లు (0.84 శాతం) పెరిగి 25,255.05 వద్ద ముగిసింది. అయితే రోజులో నమోదైన గరిష్ఠ స్థాయిల నుంచి చివర్లో కొంత లాభాల స్వీకరణ జరిగింది. నిఫ్టీకి 25,400-25,500 స్థాయుల్లో తక్షణ నిరోధం ఉందని, ఈ స్థాయిని అధిగమిస్తే మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దిగువన 25,200-25,100 స్థాయులు తక్షణ మద్దతుగా, 24,800 కీలక మద్దతుగా పనిచేస్తాయని పేర్కొన్నారు. విస్తృత మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీ 1.59 శాతం, మిడ్‌క్యాప్-100 సూచీ 0.81 శాతం పెరిగాయి. రంగాల వారీగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీ దాదాపు మూడు శాతం లాభంతో ముందంజలో నిలిచింది. బ్యాంకింగ్, ప్రైవేటు బ్యాంకింగ్, వాహన రంగాల సూచీలు కూడా రాణించాయి. మరోవైపు సమాచార సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ముడిచమురు ధరల తగ్గుదల మార్కెట్లలో ఉత్సాహాన్ని పెంచాయని నిపుణులు విశ్లేషించారు. రానున్న రోజుల్లో విదేశీ పెట్టుబడులు, కంపెనీల ఆదాయాలు, చమురు ధరలతోపాటు భారత్ అక్టోబర్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా ఉత్పత్తిదారుల ధరల సూచీ గణాంకాలు మార్కెట్ల దిశను ప్రభావితం చేయనున్నాయి.



పరీక్షల్లో పాసయ్యాడని రూ.2కోట్ల కారు గిఫ్ట్

ముంబై, నవంబర్ 11: పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు పిల్లలకు తల్లిదండ్రులు బహుమతులు ఇవ్వడం సాధారణం. అయితే పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వ్యాపారి తన 15 ఏళ్ల కుమారుడికి ఏకంగా రూ.2 కోట్లకు పైగా విలువైన బీఎండబ్ల్యూ కారు బహుమతిగా ఇచ్చి వార్తల్లో నిలిచారు. పుర్బా బర్ధమాన్ జిల్లా గల్సి ప్రాంతంలోని పరాజ్ గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి షంసుద్దీన్ మిద్యా కుమారుడు మహమ్మద్ తల్హా తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అతడికి బీఎండబ్ల్యూ ఎం4 కాంపిటీషన్ కారు అంటే ఎంతో ఇష్టం. అర్ధవార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే ఆ కారును కొనిస్తానని తండ్రి మాట ఇచ్చారు. కుమారుడు పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచడంతో షంసుద్దీన్ తన హామీని నిలబెట్టుకున్నారు. ముంబైలోని అంధేరీలో ఉన్న బీఎండబ్ల్యూ విక్రయ కేంద్రం నుంచి కారును కొనుగోలు చేసి, ఈ నెల 6న ప్రత్యేక కంటైనర్‌లో గ్రామానికి తీసుకొచ్చారు. కంటైనర్ నుంచి కారును బయటకు తీస్తుండగా గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కారు ధర సుమారు రూ.1.62 కోట్ల నుంచి రూ.2.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా. తల్హా వయసు 15 ఏళ్లు కావడంతో ప్రస్తుతం అతడికి వాహనం నడిపే అర్హత లేదు. లైసెన్స్ వచ్చే వరకు తానే కారును నడుపుతానని తండ్రి తెలిపారు. ఆయన వద్ద ఇప్పటికే రేంజ్ రోవర్, వోల్వో వంటి ఖరీదైన కార్లు ఉన్నట్లు సమాచారం. ఓ పాఠశాల విద్యార్థికి ఇంత ఖరీదైన బహుమతి ఇవ్వడంపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారత పౌరసత్వం కోసం సోనియా 15 ఏళ్లు ఎందుకు ఆగారు?: కంగనా



న్యూఢిల్లీ, నవంబర్ 11: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ భారత పౌరసత్వం స్వీకరించిన అంశంపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ ప్రశ్నలు సంధించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని 1968లో వివాహం చేసుకున్న సోనియా.. భారత పౌరసత్వం పొందేందుకు 1983 వరకు ఎందుకు వేచి చూశారని ప్రశ్నించారు. సోనియా ఇటీవల విడుదల చేసిన జ్ఞాపకాల పుస్తకాన్ని ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. సంజయ్ గాంధీ 1980లో మరణించిన మూడేళ్ల తర్వాత సోనియా భారత పౌరసత్వం స్వీకరించారని కంగనా పేర్కొన్నారు. రాజీవ్‌తో వివాహం జరిగినప్పటి నుంచి 15 ఏళ్లపాటు పౌరసత్వం తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. నవంబర్ 10న కూడా కంగనా ఈ అంశంపై వరుస పోస్టులు పెట్టారు. తన ‘ఎమర్జెన్సీ’ సినిమా కోసం గాంధీ కుటుంబ రాజకీయ చరిత్రపై విస్తృతంగా పరిశోధన చేసినట్లు తెలిపారు. సోనియా గాంధీ కుటుంబంలోకి వచ్చిన తర్వాత ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ వరుసగా మరణించారని, చివరకు సోనియా మాత్రమే రాజకీయంగా మిగిలారని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల్లో అనేక యాదృచ్ఛికాలు ఉన్నాయని తనకు అనిపించిందన్నారు. సోనియాపై విదేశీ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించారంటూ ఆరోపణలు చేశారు. సంజయ్ గాంధీ మరణం తర్వాత ఆయన భార్య మేనకా గాంధీని కుమారుడితో కలిసి ఇంటి నుంచి బయటకు పంపించారని కంగనా మరో పోస్టులో ఆరోపించారు. రాజీవ్ గాంధీ విదేశాల్లోని ఓ కేఫ్‌లో సోనియాను కలుసుకున్నారని, ఆ పరిచయం తర్వాత ఆమె గాంధీ కుటుంబంలో కీలక స్థానానికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమంలో వెల్లడించారు.

108 కొత్త శాఖలను ప్రారంభించిన యూబీఐ

విజయవాడ, నవంబర్ 11 (ఈవార్తలు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 108వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడలోని గొల్లపూడి గుంటుపల్లి రహదారిలో ఉన్న సీఏ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక వేడుక ఏర్పాటు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ డైరెక్టర్ ఎ.ఓ. బషీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ కట్టా శ్రీధర్ బాబు, ప్రాంతీయ అధిపతి ఎం.వి. తిలక్‌తోపాటు అధికారులు, ఉద్యోగులు, ఖాతాదారులు, విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 108 ఏళ్లుగా ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొంటూ బ్యాంకు అభివృద్ధి చెందుతోందన్నారు. బ్యాంకు ప్రగతిలో ఖాతాదారులు, ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విజయవాడ జోన్ పరిధిలో 489 శాఖలు, రాష్ట్రవ్యాప్తంగా 1,234 శాఖల ద్వారా సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ముంబైలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆధునిక బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన పలు నూతన డిజిటల్ ఉత్పత్తులను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 108 కొత్త శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిలో ఈశాన్య ప్రాంతంలో 25, సాధారణ వ్యాపార సేవలకు 51, యువత కోసం 16, అంకుర సంస్థల కోసం 9, వ్యవసాయ విలువ ఆధారిత ఆర్థిక సేవలకు 7 శాఖలు ఉన్నాయి. అలాగే జాతీయ రక్షణ నిధికి రూ.11.17 కోట్లు, సామాజిక బాధ్యత కార్యక్రమాలకు రూ.13.72 కోట్లు విరాళంగా అందించారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP
DASARA SPECIAL OFFER
Launch Your Cloud-Hosted ePaper Today
Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support
ePaper Pro
దసరా శుభాకాంక్షలు
20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
Smart AI image extraction · One-click publishing · Real-time analytics
AdSense & sponsor ad slots · WhatsApp sharing · AWS cloud - daily backups
Custom domain + auto SSL · AI tagging & SEO tags · YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication
CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com
SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

కయ్యారి చిత్రం





కమల్ హాసన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ అధినేత, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై తమిళనాడులో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆయన కొత్త చిత్రానికి 'సండియార్' అనే పేరు పెట్టడంపై వివాదం చెలరేగింది. ఈ పేరు కుల ఘర్షణలను ప్రేరేపించేలా ఉందంటూ పుదియ తమిళగం పార్టీ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. కమల్ హాసన్ 72వ పుట్టినరోజు సందర్భంగా నవంబర్ 7న దర్శకుడు ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో, రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న కొత్త సినిమా తొలి ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. అయితే 'సండియార్' అనే పదం ఆధిపత్య ధోరణిని, హింసను ప్రోత్సహించేలా ఉందని పుదియ తమిళగం పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దక్షిణ తమిళనాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కె. కృష్ణస్వామి ఆరోపించారు. గతంలో 2003లోనూ కమల్ హాసన్ తన సినిమాకు 'సండియార్' అనే పేరును ఖరారు చేశారు. అప్పట్లో పుదియ తమిళగం పార్టీ నిరసనల నేపథ్యంలో ఆ పేరును 'విరుమాండి'గా మార్చారు. 2004లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ అదే పేరును ప్రకటించడం కక్షసాధింపు చర్యగా ఉందని కృష్ణస్వామి విమర్శించారు. రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కమల్ హాసన్ ఇలా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు, చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



ప్రియుడిని పెళ్లాడిన ప్రియా భవానీ శంకర్

ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె బుధవారం ఉదయం చెన్నైలో సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నారు. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. వివాహ వేడుకలో ప్రియా ఎరుపు రంగు సంప్రదాయ చీరలో మెరిసిపోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నిరాడంబరంగా వివాహం చేసుకున్న ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ కాలేజీ రోజుల నుంచి స్నేహితులు. అప్పటి పరిచయం ప్రేమగా మారి దాదాపు పదేళ్ల పాటు కొనసాగింది. తమ ప్రేమ విషయాన్ని ప్రియా గతంలో పలు ఇంటర్వ్యూలు, సామాజిక మాధ్యమ పోస్టుల ద్వారా వెల్లడించారు. ఇప్పటికే ఇద్దరూ కలిసి ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల అంగీకారంతో ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వార్తా పఠనంతో కెరీర్ ప్రారంభించిన ప్రియా.. ఆ తర్వాత బుల్లితెర సీరియళ్లతో గుర్తింపు తెచ్చుకున్నారు.



గ్రీస్‌లో ఘనంగా అనిరుధ్ - కావ్యమారన్ పెళ్లి

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్య మారన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గ్రీస్ వేదికగా బుధవారం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం వైభవంగా జరిగింది. గత కొంతకాలంగా వీరి పెళ్లిపై ప్రచారం సాగుతుండగా, తాజాగా ఇరు కుటుంబాల సమక్షంలో వివాహ వేడుక నిర్వహించారు. నవంబర్ 10న సంప్రదాయ తమిళ పద్ధతిలో నిశ్చితార్థం, ఇతర ముందస్తు వేడుకలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 11న ప్రధాన వివాహ వేడుక జరిగింది. ఐవరీ, పాస్టెల్ రంగుల సంప్రదాయ వస్త్రాలు, ముత్యాల ఆభరణాలతో వధూవరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివాహం అనంతరం అనిరుధ్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పెళ్లి ఫొటోలను పంచుకున్నారు. 'మై వన్స్ ఇన్ ఏ లైఫ్‌టైమ్, ఫర్ ఏ లైఫ్‌టైమ్.. 11.11' అనే వ్యాఖ్యతో ఫొటోలను పోస్టు చేశారు. ఈ చిత్రాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఈ వేడుకకు సూపర్ స్టార్ రజనీకాంత్, ఆయన కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్, సన్ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ తదితర ప్రముఖులు కూడా నూతన దంపతులను ఆశీర్వదించారు. గ్రీస్‌లో కుటుంబ సభ్యుల మధ్య వివాహం జరగ్గా, నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖుల సమక్షంలో భారీ విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం.

శర్వానంద్ 'భోగి' విడుదల వాయిదా

యువ కథానాయకుడు శర్వానంద్ నటిస్తున్న 'భోగి' సినిమా విడుదల వాయిదా పడింది. అనుకోని కారణాల వల్ల విడుదల తేదీని మార్చినట్లు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బుధవారం సామాజిక మాధ్యమ వేదికగా ప్రకటించింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని తెలిపింది. 'భోగి' తమకు ఎంతో ప్రత్యేకమైన చిత్రమని, ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు పేర్కొన్నారు. ప్రేక్షకులకు థియేటర్లలో గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని, ఈ విషయంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లు, ఊహాగానాలను నమ్మవద్దని కోరారు. కొత్త తేదీని త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. వాస్తవానికి ఈ సినిమాను నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు. విడుదల వాయిదా కారణంగా కలిగిన అసౌకర్యానికి నిర్మాతలు విచారం వ్యక్తం చేశారు. ప్రేక్షకుల సహకారం, సహనాన్ని కోరారు. ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా కనిపించనున్నారు. 1960ల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ ఊహాజనిత గ్రామంలో జరిగే కథతో దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, కిశోర్ కుమార్ అరోకియా ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె కళా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



టాలీవుడ్‌లో ప్రియాంక చోప్రా వరుస సినిమాలు?

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియాంక చోప్రా జానాస్ మరోసారి భారతీయ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఆమె తిరిగి ప్రవేశించడం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, మహేష్ బాబు కలయికలో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంలో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా చాలా కాలం తర్వాత దక్షిణాది ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఆమె.. ఇకపై తెలుగు సినిమాల్లోనూ వరుసగా నటిస్తారా? లేక అంతర్జాతీయ చిత్రాలకే పరిమితమవుతారా? అనే చర్చ అభిమానుల్లో మొదలైంది. అంతర్జాతీయ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నప్పటికీ 'వారణాసి' వంటి భారీ చిత్రానికి ప్రియాంక అంగీకరించడం వెనుక కథలోని ప్రత్యేకత, రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, చిత్రానికి ఉన్న అంతర్జాతీయ స్థాయి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రియాంక తన కెరీర్‌ను ఆచితూచి ముందుకు తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. కేవలం అగ్ర కథానాయకుల చిత్రాలు, భారీ బడ్జెట్ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా.. ప్రభావం, అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.



కియారాకు భర్త మద్దతు

రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'టాక్సిక్' సినిమాలోని కొన్ని సన్నిహిత సన్నివేశాలపై నటి కియారా అద్వానీ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా అండగా నిలిచినట్లు కియారా వెల్లడించారు. దర్శకురాలు గీతు మోహన్‌దాస్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో కియారా 'నాదియా' అనే సర్కస్ కళాకారిణి పాత్ర పోషిస్తున్నారు. సినిమాలోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాలను ఉద్దేశించి నెటిజన్లు ఆమెను విమర్శిస్తున్నారు. వివాహం తర్వాత ఇలాంటి పాత్రల్లో నటించడంపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శలపై సిద్ధార్థ్ సానుకూలంగా స్పందించి తనకు మద్దతుగా నిలిచారని కియారా తెలిపారు. ఇతరుల వ్యక్తిగత జీవితం గురించి తెలియకుండా విమర్శలు చేసేవారిని పట్టించుకోవద్దని, అలాంటి వ్యాఖ్యలతో మానసిక ప్రశాంతతను కోల్పోవద్దని ఆయన సూచించినట్లు వెల్లడించారు. మరోవైపు నటి హుమా ఖురేషి కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. సినీ పరిశ్రమలో మహిళా నటుల పట్ల ద్వంద్వ ప్రమాణాలు చూపడం సరికాదని పేర్కొంటూ విమర్శలను ఖండించారు.



హార్దిక్ ట్రేడ్‌పై అధికారిక ప్రకటన



హార్దిక్ ట్రేడ్‌పై అధికారిక ప్రకటన

2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు టోర్నీ చరిత్రలోనే భారీ ఆటగాళ్ల బదిలీ ఒప్పందం పూర్తయింది. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులో చేరగా, భారత టీ20 జట్టు స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు బదిలీ అయ్యాడు. ఈ ఒప్పందాన్ని ఐపీఎల్ అధికారికంగా ప్రకటించింది. ఈ బదిలీలో భాగంగా హార్దిక్ పాండ్యా పారితోషికం గతంలో ఉన్న రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరిగింది. అర్ష్‌దీప్ సింగ్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ ఒప్పందంతో ముంబై ఇండియన్స్‌తో హార్దిక్ పాండ్యా రెండో విడత ప్రయాణానికి ముగింపు పలికినట్లయింది. 2015లో ముంబై జట్టుతో తన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించిన హార్దిక్, 2015, 2017, 2019, 2020 టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహించి తొలి సీజన్‌లోనే జట్టును విజేతగా నిలిపాడు. 2023లో రన్నరప్‌గా నిలిపాడు. 2024లో తిరిగి ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. హార్దిక్ ఇప్పటివరకు 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 146.28 స్ట్రైక్ రేటుతో 2,955 పరుగులు చేయడంతో పాటు 82 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు 2019లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్, పంజాబ్ కింగ్స్ తరఫున ఎనిమిది సీజన్లలో 96 మ్యాచ్‌లు ఆడి 111 వికెట్లు తీశాడు. ఆ ఫ్రాంచైజీ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లతో రాణించాడు. అతడి రాకతో ముంబై బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది.



నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ: హార్దిక్

2027 ఐపీఎల్‌కు ముందు హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్ మధ్య ఆటగాళ్ల బదిలీ ఒప్పందం పూర్తయిన తర్వాత హార్దిక్ సామాజిక మాధ్యమాల్లో తొలి పోస్టు చేశాడు. పంజాబ్ కింగ్స్ జెర్సీ ధరించి, వెనుక గర్జిస్తున్న సింహం చిత్రంతో ఉన్న ఫొటోను పంచుకున్నాడు. పంజాబీ సంప్రదాయ పలకరింపు 'సాత్ శ్రీ అకాల్, పంజాబ్' అంటూ తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఈ పోస్టులో హార్దిక్ తన కొత్త జట్టుకు పూర్తి మద్దతు ప్రకటించాడు. "నా కెప్టెన్ శ్రేయస్, నా కోచ్ రికీ, నా జట్టు పంజాబ్.. మీ వెనుక నేను అండగా ఉంటాను" అంటూ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ నాయకత్వంలో జట్టు కోసం పనిచేస్తానని స్పష్టం చేశాడు. ఈ భారీ బదిలీ ఒప్పందంలో భాగంగా ముంబై ఇండియన్స్ నుంచి హార్దిక్ పాండ్యా రూ.18 కోట్ల పారితోషికంతో పంజాబ్ కింగ్స్‌లో చేరాడు. ప్రతిగా పంజాబ్ తన స్టార్ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను అదే రూ.18 కోట్ల పారితోషికంతో ముంబై ఇండియన్స్‌కు పంపించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదంతో ఈ ఒప్పందం ఖరారైనట్లు కథనంలో పేర్కొన్నారు. 2025 ఐపీఎల్ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో, రికీ పాంటింగ్ మార్గదర్శకత్వంలో పంజాబ్ కింగ్స్ ఫైనల్‌కు చేరింది. తుదిపోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇప్పుడు బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించడంతో పాటు చివరి ఓవర్లలో బౌలింగ్ చేయగల హార్దిక్ రాకతో పంజాబ్ జట్టు మరింత బలోపేతం కానుంది. హార్దిక్ చేసిన ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.

మ్యూజియానికి సచిన్ 26 బ్యాట్లు

నవంబర్ 16న 'బ్యాటోగ్రఫీ' ప్రారంభం



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబై క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) అందించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చారిత్రక ఘనతలు సాధించేందుకు ఉపయోగించిన బ్యాట్లతో పాటు హెల్మెట్లు, జెర్సీలు, కీలక సందర్భాలకు సంబంధించిన వ్యక్తిగత నోట్లను కూడా అందజేయనున్నారు. వీటిని ముంబైలోని శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రత్యేక విభాగంలో ప్రదర్శించనున్నారు. 'బ్యాటోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శన నవంబర్ 16న ప్రారంభం కానుంది. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రదర్శనను ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ముంబైలోని వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో తన 200వ టెస్టు మ్యాచ్ ఆడిన సచిన్, అదే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముగింపు పలికారు. సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని ఆయన ఉపయోగించిన బ్యాట్ల ద్వారా పరిచయం చేయడమే 'బ్యాటోగ్రఫీ' ప్రదర్శన ప్రధాన ఉద్దేశం. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 శతకాలు సాధించిన చారిత్రక ఘనతకు ఉపయోగించిన బ్యాట్లు కూడా ఇందులో ఉండనున్నాయి. వాటి వెనుక ఉన్న విశేషాలను తెలుసుకునే అవకాశం అభిమానులకు లభించనుంది. ఈ కార్యక్రమంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ.. భారత, ప్రపంచ క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు రికార్డులకే పరిమితం కాలేదన్నారు. కోట్లాది మంది అభిమానుల జ్ఞాపకాల్లో ఆయన క్రికెట్ ప్రయాణం భాగమైందని పేర్కొన్నారు. సచిన్ తన విలువైన జ్ఞాపికలను మ్యూజియానికి అందించడం గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. దీనివల్ల భవిష్యత్ తరాల క్రికెట్ అభిమానులు ఆయన ఘనతలను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ ప్రదర్శన ద్వారా సచిన్ కెరీర్‌లోని కీలక ఘట్టాలు, వాటితో ముడిపడిన జ్ఞాపకాలను భద్రపరచడంతో పాటు అభిమానులకు వాటిని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగనుంది.

2028 ఒలింపిక్స్‌కు నీరజ్ అర్హత

భారత షూటర్ నీరజ్ కుమార్ 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఫైనల్లో 346.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఒలింపిక్స్ కోటాను ఖరారు చేసుకున్నాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన రెండో ఒలింపిక్ కోటా ఇది. అంతకుముందు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జయపాల్ మాల్వియా రజత పతకం సాధించి తొలి కోటాను అందించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో నీరజ్ అద్భుతంగా పోరాడాడు. ఒక దశలో రజత పతకం సాధించే అవకాశాలు కనిపించినప్పటికీ, 34వ షాట్‌లో 9.4 పాయింట్లు సాధించడంతో మూడో స్థానానికి పడిపోయాడు. స్లోవేకియాకు చెందిన పాట్రిక్ జానీ రజత పతకం సాధించగా, వ్యక్తిగత తటస్థ అథ్లెట్‌గా పోటీపడిన దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో ప్రపంచ జూనియర్ రికార్డు నమోదు చేసి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఈ ముగ్గురూ లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు కోటా స్థానాలు సాధించారు. ఇదే విభాగంలో ఫైనల్‌కు చేరిన మరో భారత షూటర్ ఐశ్వర్రీ ప్రతాప్ సింగ్ తోమర్ 323.7 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాడు.



న్యూజిలాండ్‌లో ప్రియురాలికి అర్ష్‌దీప్ సింగ్ ఉంగరం

టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. ప్రముఖ మోడల్, సినీ నటి సమ్రీన్ కౌర్‌కు ప్రేమను వ్యక్తం చేసి, ఆమె వేలికి ఉంగరం తొడిగాడు. బుధవారం (నవంబర్ 11) న్యూజిలాండ్‌లో ఈ వేడుక జరిగింది. అర్ష్‌దీప్ ప్రపోజ్ చేయగా సమ్రీన్ అంగీకరించడంతో ఇద్దరి నిశ్చితార్థం జరిగినట్లు తెలుస్తోంది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను అర్ష్‌దీప్, సమ్రీన్ తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకున్నారు. ఈ సందర్భంగా సమ్రీన్ భావోద్వేగ సందేశాన్ని జత చేశారు. "జీవితం మాకు ఇచ్చిన వాటన్నింటికంటే ఒకరినొకరం దక్కించుకోవడమే నాకు అత్యంత సంతోషాన్నిచ్చింది. జీవితాంతం కలిసి ఉండే ప్రయాణం మొదలైంది. 11.11.2026.. హాయ్ ఫియాన్సీ" అని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత వన్డే జట్టు పర్యటనలో భాగంగా అర్ష్‌దీప్ న్యూజిలాండ్‌లో ఉన్నాడు. వీరిద్దరి ప్రేమ వ్యవహారం గతంలోనూ క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ ఏడాది జులై చివర్లో అర్ష్‌దీప్ 'మై పర్సన్' అనే శీర్షికతో సమ్రీన్ ఫొటోలను పంచుకుని తమ బంధాన్ని వెల్లడించాడు. అంతకుముందు ఓ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భంగా సమ్రీన్‌తో కలిసి చేసే నృత్య భంగిమను అనుకరిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఆ విజయాన్ని ఆమెకు అంకితం ఇచ్చాడు.



పీటీ ఉష, అంజూ జార్జ్ మాటల యుద్ధం



భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ)లో ఇద్దరు దిగ్గజ మాజీ అథ్లెట్లు పీటీ ఉష, అంజూ బాబీ జార్జ్ మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ట్రాక్‌పై దేశానికి పేరు తెచ్చిన కేరళకు చెందిన ఈ ఇద్దరు క్రీడాకారిణులు ఇప్పుడు క్రీడా పరిపాలనలో పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. తాజా పరిణామాలు భారత క్రీడా రంగంలో చర్చనీయాంశంగా మారాయి. ఐవోఏలోని 'స్పోర్ట్స్ పర్సన్స్ ఆఫ్ ఔట్‌స్టాండింగ్ మెరిట్' (ఎస్‌వోఎం) విభాగం ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ)కి లేఖ రాశారు. ఉష ఆరోపణలను ఎన్నికల్లో విజయం సాధించిన అంజూ బాబీ జార్జ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఎన్నికల్లో ఆమె అత్యధికంగా 53 ఓట్లు సాధించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో గెలుపోటములు సహజమని, రెండింటినీ స్వీకరించడం నేర్చుకోవాలని ఉషకు సూచించారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించేవారు అందుకు సంబంధించిన బలమైన ఆధారాలను సమర్పించాలని అన్నారు. అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారిక వేదికలను ఆశ్రయించాలే తప్ప, బహిరంగంగా ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. తనకు ఎవరు ఓటు వేస్తారో ముందుగానే అంచనా వేయడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ విజయం భారత క్రీడా రంగానికి తాను అందించిన సేవలకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు తెలిపారు. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కేవలం 0.01 సెకను తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న పీటీ ఉష, ఆ తర్వాత భారత అథ్లెటిక్స్‌లో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. ప్రస్తుతం ఐవోఏ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. మరోవైపు ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో లాంగ్ జంప్ విభాగంలో కాంస్య పతకం సాధించిన అంజూ బాబీ జార్జ్ కూడా భారత క్రీడా పరిపాలనలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

కేరళం కెప్టెన్‌గా సంజూ శాంసన్

భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. త్వరలో ప్రారంభం కానున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2026 టీ20 టోర్నీలో కేరళ జట్టుకు అతడు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నీలో భాగంగా నవంబర్ 14న జరిగే తొలి మ్యాచ్‌లో కేరళ జట్టు మధ్యప్రదేశ్‌తో తలపడనుంది. ఈ పోటీల కోసం కేరళ క్రికెట్ సంఘం 18 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టులో ఎర్రబంతి క్రికెట్ కెప్టెన్ విష్ణు వినోద్‌తో పాటు ఇటీవల జరిగిన కేరళ క్రికెట్ లీగ్‌లో రాణించిన యువ ఆటగాళ్లకు చోటు కల్పించారు. అగ్రశ్రేణి బ్యాటర్ అహ్మద్ ఇమ్రాన్, బ్యాటింగ్ ఆల్‌రౌండర్ గోవింద్ దేవ్ జట్టులో స్థానం సంపాదించారు. బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ కేఎం ఆసిఫ్, స్పిన్నర్ విఘ్నేష్ పుత్తూర్‌లకు చోటు దక్కింది. సంజూ శాంసన్ నాయకత్వంలో కేరళ జట్టు ఈసారి టోర్నీలో ఎలా రాణిస్తుందన్న ఆసక్తి నెలకొంది.

ఈవార్తలు
ప్రజావాణి
గురువారం 12-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

సోనియా ఆత్మకథ.. వివాదాల వ్యథ!

రాజకీయ నాయకుల ఆత్మకథలు కేవలం వ్యక్తిగత జీవితాలకు అక్షరరూపం మాత్రమే కాదు. అవి సమకాలీన రాజకీయ పరిణామాలకు, చారిత్రక ఘటనలకు, పాలకుల నిర్ణయాలకు సంబంధించిన విలువైన ఆధారాలుగా నిలుస్తాయి. అందులోనూ దశాబ్దాలపాటు భారత రాజకీయాలను ప్రభావితం చేసిన గాంధీ కుటుంబానికి చెందిన సోనియా గాంధీ ఆత్మకథ అంటే సహజంగానే ఆసక్తి ఉంటుంది. అయితే ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకోవడం, విడుదలైన తర్వాత రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదిక కావడం చర్చనీయాంశంగా మారింది. ఒక వ్యక్తి జీవిత అనుభవాలను పంచుకోవాలన్న ప్రయత్నం రాజకీయ చరిత్రపై మరోసారి చర్చకు దారితీసింది. ఆత్మకథలోని అంశాల కంటే వివాదాలే ఎక్కువగా ప్రచారంలోకి రావడం ప్రజాస్వామ్యానికి సంబంధించిన కీలక ప్రశ్నలను ముందుకు తెస్తోంది. ఇటలీలోని చిన్న పట్టణంలో జన్మించి, భారతదేశానికి వచ్చి, దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన కుటుంబంలో భాగమైన సోనియా గాంధీ జీవితం ఎన్నో మలుపులతో కూడుకున్నది. రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, ఇందిరాగాంధీ కుటుంబంలోకి ప్రవేశం, అత్త, భర్త హత్యలు, అనంతరం రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సుదీర్ఘకాలం కొనసాగడం, 2004లో ప్రధానమంత్రి పదవిని చేపట్టకుండా మన్మోహన్ సింగ్‌కు అవకాశం కల్పించడం వంటి అనుభవాలు ఈ పుస్తకంలో ప్రస్తావనకు వచ్చాయి. వ్యక్తిగత జీవితంలోని ప్రేమ, అనుబంధాలు, విషాదాలు, రాజకీయ ఒడిదుడుకులను ఆమె తన దృష్టికోణంలో ఆవిష్కరించారు. అయితే వ్యక్తిగత జ్ఞాపకాలతోపాటు దేశ చరిత్రకు సంబంధించిన అంశాలను ప్రస్తావించినప్పుడు వాటిపై సహజంగానే ప్రజలకు ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ పుస్తకం ప్రచురణ విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు మొదటి వివాదానికి కారణమయ్యాయి. తొలుత పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకు సంబంధించిన చర్చలు జరిపినా, ముసాయిదాలోని కొన్ని అంశాలపై సంపాదకీయ మార్పులు, తొలగింపుల విషయంలో రచయిత్రి తరపుతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఆ సంస్థ ప్రచురణ నుంచి తప్పుకోగా, హార్పర్‌కాలిన్స్ ప్రచురణ బాధ్యతలు చేపట్టింది. నవంబర్ 10న పుస్తకం విడుదలైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, చైనా సరిహద్దు వివాదం, మత ఘర్షణలు, మైనారిటీల పరిస్థితి వంటి అంశాలపై ఉన్న ప్రస్తావనల విషయంలో మార్పులు కోరినట్లు కాంగ్రెస్ వర్గాలు ఆరోపించాయి. అయితే పెంగ్విన్ మాత్రం ప్రభుత్వ ఒత్తిడి కారణంగా తప్పుకున్నట్లు వచ్చిన ఆరోపణలను ఖండించింది. సాధారణ సంపాదకీయ పరిశీలనలో భాగంగానే చర్చలు జరిగాయని, ఒక అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రచురణ ముందుకు సాగలేదని స్పష్టం చేసింది. ఈ పరిణామం రచయిత స్వేచ్ఛ, ప్రచురణ సంస్థల సంపాదకీయ బాధ్యతల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని మరోసారి చర్చకు తెచ్చింది. ఇక పుస్తకంలోని చారిత్రక అంశాలు మరో వివాదానికి కేంద్రంగా మారాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశంలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లను సోనియా గాంధీ విషాదకరమైన, సిగ్గుచేటైన అధ్యాయంగా అభివర్ణించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఆ సమయంలో హింసను అరికట్టడంలో విఫలమైన అధికార యంత్రాంగాన్ని విమర్శించినప్పటికీ, రాజీవ్ గాంధీపై వచ్చిన ఆరోపణల విషయంలో ఆమె తన భర్తను సమర్థించినట్లు తెలుస్తోంది. అలాగే 1975లో ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి గురించి కూడా ఆమె తనదైన వివరణ ఇచ్చారు. ఈ అంశాలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ గతంలోని తప్పిదాలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. దేశాన్ని ప్రభావితం చేసిన ఘటనలపై రాసేటప్పుడు అందుబాటులో ఉన్న ఆధారాలు, అధికారిక నివేదికలు, న్యాయస్థానాల తీర్పులు, ఇతర ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితి, సిక్కు వ్యతిరేక అల్లర్లు వంటి అంశాలు ఒక కుటుంబానికి లేదా ఒక పార్టీకి మాత్రమే సంబంధించినవి కావు. అవి భారత ప్రజాస్వామ్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఘటనలు. బాధితుల అనుభవాలు, న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటాలు, అప్పటి ప్రభుత్వాల బాధ్యతలను విస్మరించి కేవలం కుటుంబ సభ్యుల అనుభవాలకే పరిమితమైతే చరిత్ర సంపూర్ణంగా ఆవిష్కృతం కాదు.

విద్యా సంస్కరణలకు కొత్త దారి!

తెలంగాణలో విద్యారంగంలో మరో కీలక మార్పునకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, పదో తరగతి వరకు పాఠశాల విద్య, ఆ తర్వాత రెండేళ్ల విద్యను కలిపి 10 ప్లస్ 2 వ్యవస్థను అమలు చేయాలన్న ఆలోచన విద్యావ్యవస్థలో కొత్త చర్చకు తెరలేపింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా విధానంలో మార్పులు తీసుకురావడం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు. లక్షలాది మంది విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఉన్నత విద్యలో ప్రవేశాలు, ఉపాధి అవకాశాలతో ముడిపడిన అంశం.



లక్ష్మణ్ మంగళారపు
ప్రముఖ విద్యావేత్త

ప్రపంచవ్యాప్తంగా విద్యావిధానాలు మారుతున్నాయి. పాత బోధనా పద్ధతుల స్థానంలో నైపుణ్యాలు, సృజనాత్మకత, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ఆచరణాత్మక విద్యకు ప్రాధాన్యం పెరుగుతోంది. విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడం కాకుండా, జీవితానికి అవసరమైన సామర్థ్యాలను పెంపొందించాలన్న ఆలోచన బలపడుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పును కేవలం ఇంటర్మీడియట్ బోర్డు రద్దు అనే కోణంలో కాకుండా, మొత్తం పాఠశాల విద్యా వ్యవస్థను ఎలా మెరుగుపరచాలన్న విస్తృత దృక్పథంతో పరిశీలించాలి. ప్రస్తుతం తెలంగాణలో పదో తరగతి వరకు పాఠశాల విద్యాశాఖ పరిధిలో చదువులు కొనసాగుతుండగా, పదకొండు, పన్నెండు తరగతులు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. ప్రతిపాదిత విధానంలో ఈ విభజన తొలగిపోనుంది. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాధ్యమిక విద్యగా, తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు ఉన్నత పాఠశాల విద్యగా విభజించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు నవంబర్ 11న వెలువడిన సమాచారం వెల్లడిస్తోంది. పదో తరగతి తర్వాత చదువులు మానేస్తున్న విద్యార్థుల సంఖ్యను తగ్గించడం, నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు నిరంతర విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. పదో తరగతి తర్వాత విద్యార్థుల్లో గణనీయమైన సంఖ్యలో చదువులు మానేస్తున్నారని ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ అంతరాన్ని తొలగించగలిగితే విద్యారంగంలో సానుకూల మార్పులకు అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు కలిగే ప్రయోజనాలేంటి?

ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోకి వెళ్లే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మార్పులు, సమస్యలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. పదో తరగతి తర్వాత పాఠశాల నుంచి జూనియర్ కళాశాలకు మారడం, కొత్త వాతావరణానికి అలవాటు పడటం, వేరే విద్యాసంస్థలో ప్రవేశం పొందడం వంటి పరిణామాలు విద్యార్థులపై ప్రభావం చూపుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడం, రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ముఖ్యంగా బాలికలు, పేద కుటుంబాల పిల్లలు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. పాఠశాల విద్యలోనే పదకొండు, పన్నెండు తరగతులను భాగం చేయడం ద్వారా విద్యార్థులకు ఒకే విద్యాసంస్థలో చదువు కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. మధ్యలో కళాశాల మారాల్సిన అవసరం తగ్గుతుంది. తల్లిదండ్రులకు కూడా పిల్లల చదువులపై పర్యవేక్షణ సులభమవుతుంది. పాఠశాల స్థాయిలోనే ఉన్నత తరగతుల బోధన అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కొనసాగింపు పెరిగే అవకాశముంది. మరో ముఖ్యమైన అంశం విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించడం. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లోకి ప్రవేశించగానే రెండు సంవత్సరాల విద్యను పూర్తిగా కొత్త దశగా భావించి విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ వంటి విభాగాల ఎంపికలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి మార్గనిర్దేశం చేస్తే ఉన్నత విద్యకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుంది.

ప్రత్యేక విద్యతో నైపుణ్యాలకు ప్రాధాన్యం

ప్రతిపాదిత విధానంలో తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు ఉన్నత విద్యా దశగా పరిగణించి ప్రత్యేక బోధన అందించాలన్న ఆలోచన ప్రాధాన్యమైనది. అయితే ప్రత్యేక విద్య అంటే కేవలం పాఠ్యాంశాలను విభజించడం కాదు. విద్యార్థుల అభిరుచులు, భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా విద్యను అందించాలి. సైన్స్, గణితం, సామాజిక శాస్త్రాలు, వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయం, వృత్తి విద్య వంటి విభాగాల్లో ప్రాథమిక అవగాహన కల్పించాలి. పన్నెండో తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులకు భాషా పరిజ్ఞానం, సమాచార నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాలని ముఖ్యమంత్రి సూచించడం స్వాగతించదగిన లక్ష్యం. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక పరిజ్ఞానం సరిపోదు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, సంభాషణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, ఆచరణాత్మక అనుభవం అవసరం. పాఠశాల స్థాయి నుంచే వీటిని నేర్పితే విద్యార్థులు ఉన్నత విద్యలోనూ, ఉద్యోగ రంగంలోనూ రాణించగలుగుతారు. అయితే నైపుణ్య విద్య పేరుతో సాధారణ విద్యకు ప్రాధాన్యం తగ్గకూడదు. ప్రతి విద్యార్థికి భాషలు, గణితం, విజ్ఞానశాస్త్రం, సామాజిక అంశాలపై బలమైన పునాది ఉండాలి. వృత్తి విద్యను ఎంచుకునే విద్యార్థులకు కూడా ఉన్నత విద్యకు వెళ్లే మార్గాలు మూసుకుపోకూడదు. విద్యార్థి ఒకసారి ఎంచుకున్న విభాగం నుంచి అవసరమైతే మరో విభాగానికి మారే వెసులుబాటు ఉండాలి.

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులే అసలు పరీక్ష!

పాఠశాల విద్యను పన్నెండో తరగతి వరకు విస్తరించాలన్న నిర్ణయం తీసుకోవడం ఒక ఎత్తయితే, అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం మరో ఎత్తు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల కొరత, ప్రయోగశాలల లేమి, మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి సౌకర్యాలే సరిగా లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పదకొండు, పన్నెండు తరగతులను కూడా అదే పాఠశాలలకు అనుసంధానిస్తే ఆశించిన ఫలితాలు రావడం కష్టం. ఇంటర్మీడియట్ స్థాయిలో బోధనకు ప్రత్యేక అర్హతలు, అనుభవం కలిగిన అధ్యాపకులు అవసరం. ముఖ్యంగా గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో ఉన్నత స్థాయి బోధన అందించాలి. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ కేంద్రాలు, క్రీడా సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుత జూనియర్ కళాశాలల్లో ఉన్న సౌకర్యాలను పాఠశాల విద్యలో విలీనం చేసినంత మాత్రాన నాణ్యత పెరగదు. వాటిని మరింత బలోపేతం చేయాలి. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నెరవేరాలంటే నిధుల కేటాయింపు, ఉపాధ్యాయుల నియామకాలు, పర్యవేక్షణలో చిత్తశుద్ధి అవసరం. ప్రైవేటు పాఠశాలల్లో పన్నెండో తరగతి వరకు విద్య అందుబాటులో ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లోనూ అదే స్థాయి విద్యను అందించగలిగితేనే ఈ మార్పుకు సార్థకత చేకూరుతుంది.

పేద విద్యార్థులకు వరమా.. కొత్త భారమా?

ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వ రంగానికి ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ఖర్చుతో చదువుకోవాలనుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అండగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, వ్యవసాయ కూలీల పిల్లలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇవి విద్యా అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు రద్దు తర్వాత ఈ కళాశాలల భవిష్యత్తు ఏమిటన్నది కీలక ప్రశ్న. వాటిని పాఠశాలలుగా మార్చుతారా? ఉన్నత పాఠశాలలతో అనుసంధానిస్తారా? లేక ప్రత్యేక ఉన్నత పాఠశాలలుగా కొనసాగిస్తారా? అన్నదానిపై స్పష్టత రావాలి. ఇప్పటికే ఉన్న జూనియర్ కళాశాలల భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు నిరుపయోగంగా మారకూడదు. వాటిని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలి. అలాగే పట్టణాల్లోని పాఠశాలల్లో పన్నెండో తరగతి వరకు విద్య అందుబాటులోకి వచ్చినా, మారుమూల గ్రామాల్లోని విద్యార్థులకు ఆ సౌకర్యం ఎలా



కల్పిస్తారన్నది ఆలోచించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు, తరగతి గదులు సరిపోకపోతే విద్యార్థులు మళ్లీ ప్రైవేటు విద్యాసంస్థల వైపు వెళ్లాల్సి వస్తుంది. అప్పుడు విద్యపై కుటుంబాల ఆర్థిక భారం తగ్గకపోగా పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల పేద విద్యార్థులకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందించడమే ఈ సంస్కరణకు ప్రాతిపదిక కావాలి. ఈ మార్పులో అత్యంత కీలకమైన మరో అంశం ఇంటర్మీడియట్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది భవిష్యత్తు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు సేవలందిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు రద్దయితే తమ ఉద్యోగ హోదా, పదోన్నతులు, వేతనాలు, సర్వీసు ప్రయోజనాలపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వారిలో సహజం. ప్రభుత్వం మాత్రం కొత్త విధానం వల్ల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ, పదవీ విరమణ ప్రయోజనాల విషయంలో ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చినట్లు వార్తలు వెల్లడిస్తున్నాయి. ఈ హామీని స్పష్టమైన విధివిధానాల రూపంలో ప్రకటించాలి. అధ్యాపకుల అర్హతలు, బోధనా బాధ్యతలు, సీనియారిటీ, పదోన్నతులు, బదిలీలు, భవిష్యత్తు నియామకాలపై ముందుగానే స్పష్టత ఇవ్వాలి. వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని కొత్త వ్యవస్థకు ఉపయోగించుకోవాలి. ఉద్యోగుల ఆందోళనలను పట్టించుకోకుండా సంస్కరణలు చేపడితే అమలులో ప్రతిబంధకాలు ఏర్పడవచ్చు.

ఉన్నత విద్య ప్రవేశాల్లో గందరగోళం వద్దు

తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక పరీక్షా విధానం, మార్కుల విధానం, పాఠ్య ప్రణాళిక ఉన్నాయి. ఇంజినీరింగ్, వైద్య విద్యతో పాటు ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ విద్యార్థుల మార్కులు, అర్హతలు కీలకంగా ఉంటాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు కూడా విద్యార్థులు సిద్ధమవుతుంటారు. కొత్త విధానంలో పదకొండు, పన్నెండు తరగతులను పాఠశాల విద్యలో విలీనం చేసినప్పుడు పరీక్షల నిర్వహణ ఎవరి ఆధ్వర్యంలో ఉంటుంది? మూల్యాంకన విధానం ఎలా ఉంటుంది? విద్యార్థులకు ఇచ్చే ధ్రువపత్రాల గుర్తింపు ఏమిటి? జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అర్హత్లో ఎలాంటి మార్పులు ఉంటాయి? వంటి అంశాలను ముందుగానే స్పష్టం చేయాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ఇప్పటికే పన్నెండో తరగతి వరకు ఒకే విద్యా వ్యవస్థ కొనసాగుతోంది. తెలంగాణ కూడా ఆ తరహా నిర్మాణాన్ని స్వీకరించాలని భావిస్తోంది. అయితే కేవలం పేర్లు, పరిపాలనా విభాగాలు మార్చడం వల్ల ఆ బోర్డుల స్థాయి విద్యా నాణ్యత వచ్చేయదు. పాఠ్య ప్రణాళిక, బోధనా ప్రమాణాలు, ఉపాధ్యాయుల శిక్షణ, పరీక్షల నిర్వహణలోనూ మార్పులు రావాలి. రాష్ట్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీపడేలా పాఠ్యాంశాలను రూపొందించాలి.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రతిపాదన గతంలోనూ చర్చకు వచ్చింది. తెలంగాణ విద్యా కమిషన్ కూడా ఈ దిశగా సిఫారసులు చేసింది. అయితే 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియకు సమయం తక్కువగా ఉండటం, విలీనానికి సంబంధించిన సాంకేతిక సమస్యల కారణంగా అప్పట్లో ఈ మార్పును వాయిదా వేసి, ప్రస్తుత విధానంలోనే ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకు సన్నాహాలు చేయాలని ఆదేశించింది. ఇంతటి కీలకమైన మార్పును అమలు చేయడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరం. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, అధ్యాపక సంఘాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యా పరిస్థితులను అధ్యయనం చేయాలి. ఏ ప్రాంతంలో ఎన్ని పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చాలి? ఎన్ని అదనపు తరగతి గదులు అవసరం? ఎంతమంది అధ్యాపకులను నియమించాలి? ఎంత బడ్జెట్ కావాలి? అన్న అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించాలి. అంతేకాకుండా ప్రస్తుత ఇంటర్మీడియట్‌లో చదువుతున్న విద్యార్థులు, కొత్త విధానంలో చేరబోయే విద్యార్థుల మధ్య విద్యా విధానపరమైన ఇబ్బందులు రాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలి. విద్యా సంవత్సరం మధ్యలో లేదా ప్రవేశాల సమయంలో మార్పులు చేయడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురికాకూడదు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరమే. కానీ సంస్కరణల అసలు లక్ష్యం పరిపాలనా విభాగాలను తగ్గించడం కాదు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, పేదరికం కారణంగా ఎవరూ చదువుకు దూరం కాకుండా చూడటం, ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో విశ్వాసం పెంచడం కావాలి. ఇంటర్మీడియట్ బోర్డు రద్దు చేసినంత మాత్రాన విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని భావించడం సరికాదు. బోర్డు స్థానంలో మరో పరిపాలనా వ్యవస్థ ఏర్పడవచ్చు. కానీ తరగతి గదిలో బోధన నాణ్యత పెరగకపోతే, ఉపాధ్యాయుల కొరత తీరకపోతే, ప్రయోగశాలలు అందుబాటులోకి రాకపోతే, విద్యార్థులకు నైపుణ్యాలు అలవడకపోతే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. అదే సమయంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలోని అనుభవాన్ని పూర్తిగా విస్మరించకూడదు. ఆ వ్యవస్థలో ఉన్న బలాలను గుర్తించి, లోపాలను సరిదిద్దుకుంటూ కొత్త విధానాన్ని నిర్మించాలి. ఇంటర్మీడియట్ విద్యలో సాధించిన ప్రగతి, అధ్యాపకుల అనుభవం, విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాలను కొత్త వ్యవస్థలోనూ కొనసాగించాలి. మార్పు అనేది పాత వ్యవస్థను తొలగించడం మాత్రమే కాదు.. దాని కంటే మెరుగైన వ్యవస్థను నిర్మించడం! తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 10 ప్లస్ 2 విధానం విద్యార్థులకు నిరంతర విద్యను అందించే అవకాశాన్ని కల్పించవచ్చు. పదో తరగతి తర్వాత చదువులు మానేసే పరిస్థితులను తగ్గించవచ్చు. నైపుణ్య ఆధారిత విద్యకు బాటలు వేయవచ్చు. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, అర్హులైన అధ్యాపకులు, నాణ్యమైన బోధన, సమాన విద్యా అవకాశాలు కల్పించాలి. విద్యారంగంలో తీసుకునే నిర్ణయాల ప్రభావం ఒక విద్యా సంవత్సరానికో, ఒక ప్రభుత్వ పదవీకాలానికో పరిమితం కాదు. తరతరాల భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అందుకే రాజకీయ, పరిపాలనా ప్రయోజనాల కంటే విద్యార్థుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలి. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త బాటలు వేస్తుందా? లేక మరో పరిపాలనా మార్పుగా మిగిలిపోతుందా? అన్నది అమలు తీరుపైనే ఆధారపడి ఉంటుంది. పాఠశాలల సంఖ్య పెంచడం కాదు.. విద్యా ప్రమాణాలు పెంచడం ముఖ్యం. విద్యా విధానం మార్చడం కాదు.. విద్యార్థుల జీవితాలను మార్చే విద్యను అందించడం అసలైన సంస్కరణ.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.